# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 187 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 07 జూన్ 2026 | పేజీలు : 4




వానలొస్తున్నయ్..
కొనుగోళ్లు
ఐపోవాలె..

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

2



# 240 ఎకరాల్లో..
# రూ. 2,300 కోట్లతో
# మార్కెట్ నిర్మాణం

- ఈ మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు
- రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మన చౌరాస్తా : హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో 1.34 కోట్ల జనాభాతో వేగంగా విస్తరించిన నేపథ్యంలో ఈ ప్రాంత అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్, కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌ను ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పండ్ల మార్కెట్‌తో పాటు సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

- మన చౌరాస్తా. హైదరాబాద్

2

## ఓటరు జాబితాలపై
## అప్రమత్తంగా ఉండాలి

3 లో




wanted

విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way






# 240 ఎకరాలు.. రూ. 2,300 కోట్లతో మార్కెట్ నిర్మాణం

**మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు**

**రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో 1.34 కోట్ల జనాభాతో వేగంగా విస్తరించిన నేపథ్యంలో ఈ ప్రాంత అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్, కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌ను ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పండ్ల మార్కెట్‌తో పాటు సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. “రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలకు ఏం కావాలన్నా ఇక్కడికి వస్తే అన్నీ అందుబాటులో ఉండే విధంగా 240 ఎకరాల్లో రూ. 2,300 కోట్లతో అత్యాధునిక వసతులతో మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ఈ మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది” అని విశ్వాసం వ్యక్తం చేశారు. 30, 40 ఏండ్ల కిందట పండ్లు, కూరగాయల పంటల సాగుతో రంగారెడ్డి జిల్లా కళకళలాడిందని గుర్తుచేశారు. రంగారెడ్డి జిల్లా రైతులు కష్టపడి హైదరాబాద్ ప్రజలకు పండ్లు, కూరగాయలు, పాలు సరఫరా చేసేవారని, రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు ఏది కొనాలన్నా పక్క రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయని అన్నారు. రైతులు వరి, మొక్క జొన్న, జొన్న, పత్తి వంటి కేవలం నాలుగైదు పంటలను మాత్రమే పండించడం వల్ల ప్రజలపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటున్నాయని, అందుకు ప్రత్యామ్నాయంగా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ప్రత్యామ్నాయ పంటలను పండించాలని కోరారు. స్థానిక ప్రజల సహకారంతో ప్రభుత్వం ధైర్యంగా ఈ పండ్ల మార్కెట్‌ను ప్రారంభించింది. వచ్చే రెండేళ్లలో దీన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తాం. ఈ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధుల కొరత లేకుండా గ్రీన్ చానెల్‌లో విడుదల చేస్తాం. వచ్చే డిసెంబర్‌లో పనులు ప్రారంభించే విధంగా శ్రమించాలి అని మంత్రులకు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో కాలుష్య కారక పరిశ్రమలు తెస్తామంటే, ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బ తింటాయని, అందుకే ఆ ప్రాంతంలో ఒక మహానగరాన్ని నిర్మించి ప్రపంచంలోనే గుర్తింపు పొందిన ఫార్చ్యూన్ 500 కంపెనీలను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. “రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి ఏటా 15 నుంచి 16 వేల కోట్ల ఆదాయం సమకూర్చుతున్నప్పటికీ ఎవరైనా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా ఉండదు. ఇలాంటి దుస్థితి ఉండకూడదన్న ఉద్దేశంతోనే అత్యాధునిక వసతులతో ఈ పక్కనే సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి కూడా శంకుస్థాపన చేశాం” అని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ నగరంలో 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉంటే వాటిని 12 క్లస్టర్లుగా అత్యంత అధునాతన సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించుకుంటున్నామని తెలిపారు. “అంతర్జాతీయ నగరమని మనకు మనం గొప్పులు చెప్పుకుంటే సరిపోదు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసుకున్నప్పుడే ఆ గుర్తింపు వస్తుంది. అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం, మెట్రో విస్తరణ వంటి పనులను పూర్తి చేస్తాం” అని స్పష్టం చేశారు. కోహెడ పండ్ల మార్కెట్ నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి జరిగిందంటే రాష్ట్రంలో అభివృద్ధి జరిగినట్టేనని, రైతును రాజును చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.



## వానలొస్తున్నయ్.. కొనుగోళ్లు ఐపోవాలె..

**– కలెక్టర్లకు సీఎస్ ఆదేశం**

**జనగామ, మన చౌరాస్తా:** మరో రెండు రోజుల్లో రుతు పవనాలు రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో వరి కొనుగోలు ప్రక్రియ, అలాగే జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్య ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులు, గోదాములకు తరలించాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి జిల్లాల నుంచి మహిళా సంఘాల సభ్యులను ఆర్టీసీ బస్సుల్లో తరలించాలని, ప్రయాణ సమయంలో భోజనం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, డీసీఓ కరుణ, ఏసీపీ భీం శర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.






# ఓటరు జాబితాలపై అప్రమత్తంగా ఉండాలి

**■ డీసీసీ ప్రెసిడెంట్ ధన్వంతి**



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా:** ఓటరు జాబితాల నిర్వహణలో అప్రమత్తత అవసరమని జనగామ డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ సూచించారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ఓటర్ల జాబితాల్లో జరిగే అనుమానాస్పద మార్పులు, అక్రమ చేర్పులు, తొలగింపులపై బీఎల్ఏలు నిశితంగా దృష్టి సారించాలని సూచించారు. తమ పరిధిలోని ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఓటరు జాబితాల అంశంపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల హక్కుల పరిరక్షణలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కడియం కావ్య ఆధ్వర్యంలో బీఎల్ఏలకు ప్రత్యేక బుక్‌లెట్ రూపొందించి, ఫారం 6, ఫారం 7, ఫారం 8 వినియోగంపై అవగాహన కల్పిస్తూ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పారదర్శక ఎన్నికల ప్రక్రియ కొనసాగేందుకు బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, శిక్షణ ట్రైనర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, పరిశీలకులు దుద్దిళ్ల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# మట్టి పాత్రల తయారీలో కొత్త విధానాలను ప్రోత్సహించాలి

**– తెలంగాణ కుమ్మరుల సంఘం రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కొన్నె సిద్దయ్య**

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని కుమ్మరుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతి కోసం ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ కుమ్మరుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామ జిల్లా కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఏనుగుతల సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శి దాసారం శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కొన్నె సిద్దయ్య, రాష్ట్ర కన్వీనర్ ఏనుగుతల యాదగిరి హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి కుల బాంధవుల హక్కుల సాధన, సామాజిక, ఆర్థిక, రాజకీయ పురోగతికి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొన్నె సిద్దయ్య మాట్లాడుతూ సంప్రదాయ కుమ్మరి వృత్తిని కొనసాగిస్తున్న కుటుంబాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించాలని, మట్టి పాత్రల తయారీలో నూతన విధానాలను ప్రోత్సహించాలని కోరారు. కుమ్మరి వృత్తిదారులకు అవసరమైన మట్టిని ప్రభుత్వం అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మట్టి సేకరణ హక్కు కల్పించాలి..**

జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కుమ్మరులకు చెరువుల నుంచి నాణ్యమైన మట్టిని ఉచితంగా సేకరించుకునే హక్కు కల్పించాలని, మట్టి సేకరణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి సంబంధిత జీవోలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తి మేరకు రాజకీయ, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో కుమ్మరులకు ప్రాతినిధ్యం కల్పించాలని తీర్మానించారు. ఈ నెల 10న నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా కుమ్మరుల సమావేశానికి గ్రామాలు, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కుమ్మరుల హక్కుల సాధనలో ఈ సమావేశం మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యడ రమేష్, సోషల్ మీడియా నాయకుడు వంగపల్లి కుమార్, తరిగొప్పుల మండల అధ్యక్షుడు ఎదునూరి ఎల్లయ్య, గుడిశాల రమేష్, రవి కుమార్, రమేష్, రాజు, భూమయ్య, అంజయ్య, వేణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో పర్యటించిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు

**వరంగల్, మన చౌరాస్తా :** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సిద్ద వెంకట సూర్యప్రకాష్‌రావు శుక్రవారం వరంగల్ వాసవి క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వాసవి మాత, వేంకటేశ్వర స్వామి దేవాలయాల సందర్శనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం భద్రకాళి ఆలయానికి ఒక అల్మారా, లక్ష్మీదేవి ఆలయానికి ఆరు అల్మారాలు, వాసవి భవనానికి హుండీ, అల్మారాను అందజేశారు. స్వయంకృషి వృద్ధాశ్రమానికి వాటర్ డిస్పెన్సర్, ప్రాంతీయ కంటి ఆసుపత్రికి 50 ప్లాస్టిక్ కుర్చీలు విరాళంగా ఇచ్చారు. అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించడంతో పాటు ఐదుగురు విశ్రాంత సైనికులను ఘనంగా సన్మానించారు. పేదలకు పెన్షన్లు, నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# కర్నాటక సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

**జనగామ, మన చౌరాస్తా:** కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య రాష్ట్రాల అభివృద్ధి, రాజకీయ పరిణామాలు, పరస్పర సహకార అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. జనగామ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంబంధ అంశాలపై కూడా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ముఖ్యమంత్రితో అభిప్రాయాలు పంచుకున్నారు.




# కోహెడ పండ్ల మార్కెట్‌లో 60 వేల మందికి ఉపాధి

**– జనగామ ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్**

**జనగామ, మన చౌరాస్తా:** రైతులను రాజుగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ శివారు కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి రైతులు, అధికారులు, మహిళలు ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా చైర్మన్ శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి అంతర్జాతీయ స్థాయి సమీకృత పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు. ఈ మార్కెట్ ద్వారా సుమారు అరవై వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు, ఆధునిక వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా రూపొందిస్తున్న ఈ కోహెడ పండ్ల మార్కెట్ దేశంలోనే అతిపెద్దదిగా, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ రామకృష్ణ, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అంజిత్ రావు, సూపర్వైజర్ శ్రీనివాస్, వివిధ గ్రామాల రైతులు యాదగిరి, సత్తయ్య, కొమురయ్య, వ్యాపారులు కృష్ణారెడ్డి, రాజు, సిబ్బంది ఆయిలయ్య, కృష్ణ, కుమారస్వామి, రియాజ్, శారద తదితరులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**